క్లుప్తంగా

ప్రజలందరికీ కృతజ్ఞతలు


వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్‌: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌ రోజు సోమవారం ఓటు వేసిన నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయానికి కష్టపడి పనిచేయడమే కాకుండా ప్రజలను పెద్ద ఎత్తున చైతన్యపరిచి పోలింగ్‌ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ వలంటీర్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్లకు ధన్యవాదాలు


ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

శింగనమల: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పోలిగ్‌ బూత్‌ ఏజెంట్లకు వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో పోలింగ్‌ ప్రశాంతంగా జరగడానికి సహకరించన అధికారులు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

'పాత్రికేయుడిని దూషించలేదు'

గుత్తి: పాత్రికేయులన్నా, పత్రికా వ్యవస్థ అన్నా తనకు గౌరవమని, తాను ఎవరినీ దూషించలేదని వైఎస్సార్‌ సీపీ పట్టణ కన్వీనర్‌ పీరా అన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని ఆర్‌కే ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఆంధ్రజ్యోతి విలేకరిని తాను దూషించినట్లు అదే పత్రికలో అవాస్తవ వార్త ప్రచురించారన్నారు. గుత్తిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆ విలేకరి సోమవారం పోలింగ్‌ సందర్భంగా టీడీపీ అభ్యర్థికి ప్రచారం చేస్తుండగా దండిచామన్నారు. అయితే తాను దూషించినట్లు, దాడికి ప్రయత్నించినట్లు వారి పేపర్‌లో వార్త రాసుకోవడం సిగ్గు చేటన్నారు .

నిరుపేద కుటుంబానికి సాయం


సరుకులు అందజేస్తున్న రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు గ్రామంలో హరిజన రవికుమార్‌ అనే నిరుపేద కుటుంబానికి అమ్మ సంస్థ అధ్యక్షుడు రూ. 50 వేలు విలువ చేసే సరుకులు, 20 వేల విలువ చేసే వంట సామాగ్రి అందజేశారు. రవికుమార్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు న్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెలు మానసిక దివ్యాంగులు. అతడు ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇతనికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతినడంతో ఇంటికే పరిమితమయ్యాడు. అతడి భార్య లక్ష్మిదేవి కూలిపనికి పోతేగానీ పూట గడవని పరిస్థితి. దీంతో అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి సరుకులు, సామగ్రి పంపిణీ చేశారు. చిన్న కుమార్తె విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. రమణారెడ్డి సహాయానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఓబుళాపురంలో కొనసాగుతున్న బందోబస్తు

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురంలో సోమవారం ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగిన విషయం విదితమే. దీంతో గ్రామంలో అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ఒక హెడ్‌ కానిస్టేబుల్‌, ముగ్గురు కానిస్టేబుళ్లతో పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్‌ తీగలపై పడిన చెట్టు


జేసీబీతో చెట్టు తొలగిస్తున్న విద్యుత్‌ సిబ్బంది

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌ రోడ్డులో మంగళవారం ఈదురు గాలులకు ఓ చెట్టు విద్యుత్‌ తీగలపై పడింది. దీంతో కరెంట్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌ ఉద్యోగులు, సిబ్బంది జేసీబీ సాయంతో విద్యుత్‌ తీగలపై పడిన చెట్టును తొలగించి సాయంత్రం 5.30 గంటలకు కరంట్‌ సరఫరా పునరుద్ధరించారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

- ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు, వృద్ధులు
- శింగనమలలో గతంలో కంటే పెరిగిన పోలింగ్‌ శాతం
- ఓడిపోతామనే అక్కసుతో టీడీపీ దాడులు

గార్లదిన్నె: పోలింగ్‌ ముగియడంతో ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ విజయవకాశాలపై అంచనాలు వేసుకుంటున్నారు. కౌంటింగ్‌కు ఇంకా 20 రోజులు సమయం ఉంది. శింగనమల నియోజకవర్గంలో ఈ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎవరు గెలిస్తే.. అదే పార్టీ ప్రభుత్వం అధికారం చేపడుతుందని సెంటిమెంట్‌. నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల మధ్యనే పోటీ నెలకొనడంతో ఉత్కంఠ నెలకొంది. 2019 ఎన్నికల్లో అధికార పార్టీవైవైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దాదాపు 46,242 మెజార్టీతో గెలుపొందడం.. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరడంతో ఓటు బ్యాంకు కలిసొచ్చింది. క్షేత్రస్థాయిలో టీడీపీ ఓటు బ్యాంకును తమ వైపు లాక్కునేందుకు ప్రయత్నించినప్పటికీ పెద్దగా సఫలం కాలేదు.


శింగనమల మండలం బండమీదపల్లిలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్‌)

పోటెత్తిన మహిళా ఓటర్లు

శింగనమల నియోజకవర్గంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మహిళ ఓటర్లు పోటెత్తారు. ఉదయమే పోలింగ్‌ కేంద్రాలకు భారీగా చేరుకుని ఓటేశారు. నియోజకవర్గంలో 80.3 శాతం పోలింగ్‌ నమోదైంది. 2019 ఎన్నికలతో పోల్చితే పోలింగ్‌ శాతం పెరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,47373 మంది ఓటర్లు ఉండగా 2,05,068 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌ శాతం పెరగడంతో ఎవరికి వారే తమకు అనుకూలంగా ఫలితాలు ఉంటాయని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. ఓటింగ్‌ రోజు వాతావరణం చల్లగా ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, వృద్ధులు అధికసంఖ్యలో తరలి వచ్చి క్యూ లైన్‌ లో నిలబడి రాత్రి 11గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌లో వృద్ధులు, మహిళలు అధిక శాతం పాల్గొనడంతో.. వీరంతా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినవారే అని, మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేశారని ప్రజలు, నాయకులు చర్చించుకోవడం విశేషం.

ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

సార్వత్రిక ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గంలో టీడీపీ ఓడిపోతుందనే భయంతో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారని ప్రజలు చర్చించుకోవడం విశేషం. సోమవారం పుట్లూరు మండలంలోని ఓబుళాపురం గ్రామ ఆర్టీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రానికి వైఎ స్సార్‌సీపీ మద్దతుదారులే అధికంగా రావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు రెచ్చిపోయి మూకుమ్మడిగా కర్రలతో దాడికి తెగబడడంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పుజారి కృష్ణయ్య, వెంకటకృష్ణ, రమణ, సుధాకర్‌, రాజు తీవ్రం గా గాయ పడ్డారు.బుక్కరాయసముద్రంలో 141,134 పోలింగ్‌ కేంద్రాల వద్ద టీవైఎస్సార్‌సీపీ నాయకులపై డీపీ నాయకులు దాడి చేశారు. నార్పల ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని టీడీపీ అభ్యర్థి పరిశీలించారు. వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఓట్లు పడుతున్నాయనే అక్కసుతో పోలింగ్‌ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల కమిషన్‌ ఆదేశాలు మేరకే పని చేస్తున్నామని అధికారులు ఆమెకు సమాధానం చెప్పారు.

శింగనమలలో ఓటర్ల తీర్పు ఎటు?

శింగనమల అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మన్నెపాకుల వీరాంజనేయులు, టీడీపీ అభ్యర్థిగా బండారు శ్రావణి, కాంగ్రెస్‌ నుంచి సాకే శైలజానాథ్‌తో పాటు మరో 11 మంది పోటీ చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య నువ్వా? నేనా? అన్నట్లు పోటీ సాగింది. పోలింగ్‌ సరళిని బట్టి చూస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి అనుకూలంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు. గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో టీడీపీకి ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదని స్పష్టమవుతుంది. అధికార పార్టీ వైఎస్సార్‌సీపీకి అనుకూల పవనాలు వీచినట్లు తెలుస్తోంది.శింగనమల నియోజకవర్గం లో రెండోసారి వైఎస్సార్‌ సీపీ గెలుస్తుందని బలంగా చర్చ జరుగుతోంది. ఏదేమైనా ఓటర్లు తీర్పు బయటపడాలంటే జూన్‌ 4 వరకు వేచి ఉండాల్సిందే.

గుంతకల్లులో 75.31 శాతం పోలింగ్‌

- మొత్తం ఓటర్లు 2,70,648.. పోలైన ఓట్లు 2,03,820
- ఓటింగ్‌ సరళిపై చర్చలు

గుంతకల్లు: గుంతకల్లు శాసనసభ ఎన్నికల్లో గత ఎన్నికల కంటే ఒక్కశాతం అధికంగా ఓటు వేశారు. సోమవారం ఆర్ధరాత్రి వరకూ జరిగిన ఎన్నికల్లో 75.31 శాతం ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో 276 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,70,648 ఉండగా 2,03,820 మంది ఓటు వేశారు. ఇందులో పురుషులు 99,738 మంది, మహిళలు 1,00,411 మంది, ఇతరులు 30 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలు అధికంగా ఓటు వేశారు. దాదాపు నెల రోజుల నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం కల్పించడంతో ఓటింగ్‌ శాతం పెరిగింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 74.15 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో నియోజకవర్గంలో 2,52,372 మంది ఓటర్లు ఉండగా ఈ ఎన్నికల్లో దాదపు 18,276 మంది ఓటర్లు పెరిగారు.


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పోలింగ్‌ సరళిపై చర్చలు

ఎన్నికలు ముగియడంతో మంగళవారం ఆయా పార్టీల అభ్యర్థులు తమ నాయకులతో చర్చలు జరిపారు. సోమవారం ఆయా వార్డులు, గ్రామాల్లో జరిగిన పోలింగ్‌లో తమకు ఏ మేరకు ఓట్లు వస్తాయనే ఆరా తీశారు. మంగళవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి ఇంటికి నాయకులు, కార్యకర్తలు వచ్చి కలిశారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌ సీపీ మెజార్టీ వస్తుందని తమ లెక్కలను వైవీఆర్‌కు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రత్యేక చాటుకుకోవడం, సేవ కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ విజయానికి నాంది పలుకుతాయన్నా. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జితేంద్రగౌడ్‌పై దాదాపు 48,000 పైచిలుకు మెజార్టీ సాధించామని, ఈ సారి ఆ రికార్డులను తిరిగి రాయబోతున్నాని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకెళ్లారు.

గుంతకల్లు పట్టణంలో 68.13 శాతం

గుంతకల్లుటౌన్‌: పట్టణంలో మహిళా ఓటర్ల చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో మహిళలు పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలో మొత్తం 39,394 మంది మహిళలు ఈవీఎంలల్లో తమ ఓటును నిక్షిప్తం చేశారు. పురుషులు 37,343 మంది, ఇతరులు 18 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే మహిళలు అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పురుషుల కంటే అధికంగా 2,047 మంది ఓటేశారు. సీఎం జగన్‌ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందింది మహిళలే కావడంతో వారి ఓటింగ్‌ శాతం పెరిగినట్లు తెలుస్తోంది. గుంతకల్లు పట్టణంలో 37 వార్డులున్నాయి. ఇందులో 68.13 శాతం పోలింగ్‌ నమోదైంది.


భగత్‌సింగ్‌ స్కూల్‌ పీఎస్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూకట్టిన మహిళలు (ఫైల్‌)

అర్ధరాత్రి వరకూ కొనసాగిన ఓటింగ్‌

- తాడిపత్రి నియోజకవర్గంలో 83.08 శాతం పోలింగ్‌

తాడిపత్రి: తాడిపత్రి నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం జరిగిన పోలింగ్‌కు పోటెత్తారు. ఎన్నడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున ఆయా పోలింగ్‌ కేంద్రాలకు చేరుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసింది. వేసవి కాలం కావడంతో ఎండల వేడికి కాస్త పోలింగ్‌కు హాజరయ్యేవారి సంఖ్య తక్కువగానే ఉంటుందన్న అనుమానాలను తోసిపుచ్చి పోలింగ్‌ కేంద్రాల వద్దకు ఓటింగ్‌ సమయానికి ఓ గంట ముందుగానే ఓటర్లు వారి ఓటును వినియోగించుకునేందుకు పెద్దఎత్తున బారులు తీరడం కనిపించింది. నియోజకవర్గంలోని తాడిపత్రి పట్టణంతో పాటు, మండలం, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లోని పోలింగ్‌ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ఓటర్లు చేరుకున్నారు. వాతావరణం మారి కాస్త జల్లులు కురుస్తున్నప్పటికీ ఓటర్లు పోలింగ్‌ కేంద్రాలకు చేరుకోవడం మానలేదు. మాక్‌ పోలింగ్‌ అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్‌ మొదలైంది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌కు అవకాశం ఉండడంతో ఓటర్లు పెద్ద ఎత్తున పోటెత్తడంతో సాయంత్రం 6 గంటల సమయానికి చాలా పోలింగ్‌ కేంద్రాల్లో అప్పటికే క్యూ లైన్లలో నిల్చున్న వారికి కూడా ఓటు వేసే హక్కు కల్పించడంతో రాత్రి 7 నుంచి 10 గంటల వరకు కూడా కొన్ని పోలింగ్‌ కేంద్రాలలో ఓటర్లు వారి ఓటును వినియోగించుకున్నారు. తాడిపత్రి మండలంలోని అయ్యావారిపల్లిలో 165 పోలింగ్‌ కేంద్రం, తాడిపత్రి పట్టణంలోని బాయ్స్‌ హై స్కూల్‌లోని 250, 251 పోలింగ్‌ కేంద్రాలు, చిన్నపొడమలలోని 154 పోలింగ్‌ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఆయా పోలింగ్‌ కేంద్రాల్లో పోలింగ్‌ కాస్త ఆలస్యం కావడంతో కాసేపు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో 2,48,880 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 272 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు కొన్ని పోలింగ్‌ కేంద్రాల్లో ప్రజలు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లను పరిశీలిస్తే 83.08 శాతంగా నమోదైంది. మొత్తం నియోజకవర్గంలోని ఓటర్లలో 2,06,759 లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రజలు వారి ఓటును పెద్ద ఎత్తున వినియోగించుకోవడంతో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మరో మారు ఎంపికయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.


తాడిపత్రి పట్టణంలోని చర్చి స్కూలు పోలింగ్‌ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్‌)

గెలిచేది మేమే.. నిలిచేది మేమే..

గుత్తి: ఎన్నికల్లో గెలిచేది మేమే నిలిచేది మేమే అంటూ వైఎస్సార్‌ సీపీ నాయకులు దీమా వ్యక్తం చేశారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని ఆర్‌కే ఫంక్షన్‌ హాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతల సభ నిర్వహించారు. అనంతరం అక్కడే ప్రెస్‌మీట్‌ నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, సీనియర్‌ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్‌ పీరా, పామిడి ఎంపీపీ బోగాతి మురళీమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌ యాదవ్‌, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, గురు ప్రసాద్‌ యాదవ్‌, డాక్టర్‌ శాంతి ప్రియ మాట్లాడారు. ఎన్నికల పోలింగ్‌ సరళిని బట్టి చూస్తూ వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట రామిరెడ్డి అత్యధిక మెజారీతో గెలవబోతున్నారన్నారు. నెల రోజులుగా ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ వైఎస్సార్‌ సీపీ నాయకులతో పాటు ఎమ్మెల్యే పై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం , రెచ్చగొట్టేటా మాట్లాడారన్నారు. తాము వారి కంటే ఇంకా ఎక్కువగా తిట్టగలమన్నారు. అయితే తమకు సంస్కారం అడ్డువచ్చిందన్నారు. ఇక సహించేది లేదన్నారు. టీడీపీ నాయకులు ఇంకోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. జూన్‌ 4 తర్వాత ఎవరి సత్తా ఏంటో, మా జోలికి వస్తే ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. మేము ఎవరికీ భయపడమన్నారు. భయపెట్టిస్తామన్నారు. ప్రజలకు మేలు చేయడం మా ఎజెండా అన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మంజునాథ్‌రెడ్డి

గాయపడిన వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. మండలంలోని కనంపల్లికి చెందిన సురేంద్ర(36) అనే వ్యక్తి ఈ నెల 2న ద్విచక్రవాహనంలో కల్లూరు నుంచి కనంపల్లికి వస్తూ.. రామ్‌దాస్‌పేట వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి

కళ్యాణదుర్గం రూరల్‌: మండలంలోని కొత్తూరులో ఓటమి భయంతో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మంగళవారం దాడి చేశారు. కొత్తూరులో సోమవారం చిన్నపాటి ఘర్షణల మధ్య పోలింగ్‌ జరిగింది. టీడీపీకి చెందిన వారు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండగా, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో మంగళవారం వైఎస్సార్‌సీపీకి చెందిన హనుమంతరాయుడుపై టీడీపీకి చెందిన జ్యోతి, అనసూయ, లలితమ్మ, శకుంతలమ్మ, చిట్టెమ్మ, ఈశ్వరమ్మ, సోమనాథ్‌, నరసింహులు, వెంకటేశులు, రవి, నరసింహులు, బన్ని, మంజు దాడి చేశారు. దాడిలో హనుమంతరాయుడు గాయపడ్డాడు. ఘటనపై రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న షిరిడీసాయిబాబా ఆలయ 31వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. షిరిడీసాయి భక్త మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు సంయుక్తంగా వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు కాగడ హారతి, కలశాలతో ఊరేగింపు, సచ్చరిత్ర పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


వేడుకల్లో సచ్చరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

తొండపాడులో 16న మిశ్రమ బియ్యం వేలం

గుత్తి రూరల్‌: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సేకరణకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రాణి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జక్కలచెరువు గ్రామ శివారులోని సర్వే నంబర్‌ 643లోని 8.04 ఎకరాలు, సర్వే నంబర్‌ 353లోని 1.62 ఎకరాలు, అప్పేచెర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్‌ 359లోని 2.22 ఎకరాలు, సర్వే నంబర్‌ 115-1లోని 1.60 ఎకరాల భూములను కౌలుకు తీసుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆలయ అవరణలో సాయంత్రం 4గంటల సమయంలో వేలం ఉంటుందని రూ.1,000 డిపాజిట్‌ చెల్లించాలని ఈఓ తెలిపారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి కృతజ్ఞతలు

పామిడి: మండలంలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం ప్రచారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకట్రామిరెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్‌ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్‌ కన్వీనర్లు జోజోడేకుమార్‌, కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్‌ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ మధుసూధన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌ పెమ్మక చెన్నకేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్లు బీ ఆసిఫ్‌, ఎం. కుమార్‌రెడ్డి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. 50 రోజుల పాటు ప్రచారంలో మండుటెండలను సైతం లెక్కచేయక కష్టపడిన ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ ఎన్నటికీ మరువదన్నారు. ప్రశాంత పోలింగ్‌కు సహకరించిన అధికారులు, ఓటర్లకు వారు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని రన్నింగ్‌ స్టాఫ్‌ ధర్నా

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లోని లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ బ్రాంచ్‌ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ జోనల్‌ వర్కింగ్‌ కమిటీ సభ్యుడు కె.శేఖర్‌ మాట్లాడుతూ రైల్వే ఉన్నతధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం కార్మికుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రన్నింగ్‌ కార్మికులను జోనల్‌ పరిధిలోని సైడింగ్‌ ఫ్యాక్టరీలో పని చేయాలని ఆర్డర్‌ వేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ముఖ్యంగా గుంతకల్లు డివిజన్‌ భారతి రైల్వేలో ఒక ప్రయోగశాల మారిందన్నారు. అందుకు నిదర్శనం క్రాక్‌ స్పెషల్‌, ఫైథాన్‌ రేక్‌, ప్రీమియం బీపీసీ, బాక్స్‌ తొలగించడం, డిపోలను బై పాస్‌ చేయడం తదితర వాటిని ఈ డివిజన్‌ను నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. అంతేకాకుండా సీనియారిటీ లేకుండా ప్రమోషన్స్‌ ఇవ్వడం, ట్రైనింగ్‌లకు పంపకుండా ఉంచటం డబుల్‌ కాల్‌ సిస్టమ్‌ వంటివి కూడా ఇక్కడ నుంచే మొదలయ్యాన్నారు. వీటిన్ని భరిస్తూ పని చేస్తున్నామన్నారు. అధికారులు ఏకపక్ష నిర్ణయాలకు స్వస్తిపలికి కార్మికుల శ్రేయస్సుకు పాటుపడాలని హితవుపలికారు. కార్యక్రమంలో రన్నింగ్‌ స్టాఫ్‌ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మనోవేదనతో విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్‌)

గుత్తి: ఇచ్చిన అప్పు తిరిగి రాదనే బెంగతో మనోవేదనకు లోనై విశ్రాంత రైల్వే ఉద్యోగి లక్ష్మీనారాయణ(64) మృతి చెందారు. వివరాలు... గుత్తి ఆర్‌ఎస్‌లోని ఓ ప్రైవేట్‌ స్కూల్‌ సమీపంలో నివాసముంటున్న లక్ష్మీనారాయణ రైల్వేలో పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆ సమయంలో వచ్చిన డబ్బులో రూ. 8 లక్షలను తన సహోద్యోగి, స్నేహితుడైన చినబాబు (గుత్తి ఆర్‌ఎస్‌)కు ఇల్లు కట్టుకునేందుకు అప్పుగా ఇచ్చాడు. ఇందులో రూ.3 లక్షలు తిరిగి ముట్టాయి. మిగిలిన రూ. 5 లక్షలు ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా చినబాబు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి లక్ష్మీనారాయణ తన పెద్దకొడుకు విజయభాస్కర్‌, కౌన్సిలర్‌ వెంకటసుబ్బయ్యతో కలసి చినబాబు ఇంటికెళ్లి డబ్బు విషయం లేవనెత్తాడు. ఆ సమయంలో చినబాబు కుమారుడు కరీం డబ్బు ఇచ్చేది లేదు ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో అని గద్దించాడు. దీంతో డబ్బు తిరిగి రాదనే బాధతో మనోవేదనకు లోనైన లక్ష్మీనారాయణ అక్కడే కుప్పకూలి పోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ తండ్రి మృతికి చినబాబు, అతని కుమారుడు కరీమే కారణమని లక్ష్మీనారాయణ కుమారులు విజయ భాస్కర్‌, దుష్యంత్‌, రాజేష్‌ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా .. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్‌: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్‌ జాతీయ రహదారిపై మంగళవారం ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లు నుంచి ప్రయాణికులతో గుత్తి వైపునకు ఆటో బయలుదేరింది. శ్రీపురం గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన లోలోనాయక్‌, తురకపల్లి గ్రామానికి చెందిన సుంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రం 44వ జాతీయ రహదారిపై లోలూరు క్రాస్‌ సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు.. గార్లదిన్నెకు చెందిన వేణుగోపాల్‌ అనే వ్యక్తి ద్విచ క్రవాహనంలో అనంతపురం వైపు నుంచి గార్లదిన్నెకు వస్తుండగా లోలూరు క్రాస్‌ సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొనడంతో వేణుగోపాల్‌కు రక్తగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్‌ చేశారు.